# మురికి కాలువలు నిర్మించరూ!

- రోడ్లపై ప్రవహిస్తున్న మురికినీరు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

**బాల్కొండ:** మురికి కాలువలు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వెంటనే అధికారులు స్పందించి కాలువలను నిర్మించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. 1996లో మండల కేంద్రంలో ఎన్టీఆర్ కాలనీని ఏర్పాటు చేశారు. నాటి నుంచి కాలనీలో అనేక మంది ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. కాలనీలో నిర్మాణాలు పెరుగుతున్నా వసతులు మాత్రం మెరుగుపడటం లేదు. దీంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలనీలో ప్రధాన రోడ్డు వెంబడి మాత్రమే మురికి కాలువ ఉన్నాయి. మిగతా చోట్ల కాలువల నిర్మాణాలు చేపట్టలేదు. దీంతో మురికి నీరు ఇళ్ల మధ్యలో నిలుస్తోంది. దీంతో దుర్వాసనతో స్థానిక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అనేక మంది అనారోగ్యానికి గురైన ఘటనలు ఉన్నాయి. అంతేకాకుండా కాలనీలోని పలు చోట్ల మురికి నీరు రోడ్డుపైనే ప్రవహిస్తోంది.

**ఫలితం ఇవ్వని పారిశుద్ధ్య వారోత్సవాలు**

సర్పంచుల పదవి కాలం ముగియడంతో గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన నిర్వహించారు. గత నెలలో ప్రత్యేక పారిశుద్ధ్య వారోత్సవాలు నిర్వహించారు. కానీ మండల కేంద్రంలోని ఎన్టీఆర్ కాలనీలో మాత్రం పారిశుద్ధ్య వారోత్సవాలు చేపట్టలేదు. ఫలితంగా కాలనీవాసులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలనీలో ఎటు చూసినా మురికి నీరే కనిపిస్తోంది. దీంతో దోమలు విపరీతంగా పెరిగి స్థానిక ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. ఇకనైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి మురికి కాలువలను నిర్మించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



ఎన్టీఆర్ కాలనీలో ఇంటి పక్కన నిలిచిన మురికి నీరు



రోడ్లపై ప్రవహిస్తున్న మురికి నీరు

**తీర్మానాలు చేశాం..**

మండల కేంద్రంలోని పలు కాలనీల్లో మురికి కాలువలు నిర్మించాలని ఇది వరకే తీర్మానాలు చేశాం. జీపీ నిధుల ప్రకారం ఒక్కో కాలనీలో కాలువల నిర్మాణాలు చేపడుతున్నాం. త్వరలోనే మురికి కాలువలు నిర్మిస్తాం.

– రజనీకాంత్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి, బాల్కొండ

# పల్స్‌పోలియోపై అవగాహన ర్యాలీ



బోధన్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది



పోచంపాడ్‌లో..

**బోధన్ టౌన్/ రుద్రూర్/ బాల్కొండ/ నందిపేట:** జిల్లాలోని అన్ని గ్రామాల్లో ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు నిర్వహించే పల్స్‌పోలియోపై వైద్యశాఖ ఆధ్వర్యంలో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. బోధన్‌లో నిర్వహించిన ర్యాలీలో డిప్యూటీ డీఎంహెచ్‌వో విద్య మాట్లాడుతూ.. తల్లితండ్రులు తమ ఐదేళ్ల లోపు చిన్నారులకు తప్పకుండా పల్స్ పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. కోటగిరి మండల కేంద్రంలో పల్స్ పోలియో కార్యక్రమంపై వైద్యశాఖ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. మండల ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్ మాట్లాడుతూ.. కోటగిరి ఉమ్మడి మండలంలోని ఐదేళ్లలోపు 4719 మంది చిన్నారులకు చుక్కల మందు వేయడానికి 55 బూత్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పల్స్ పోలియోను విజయవంతం చేయాలని కోరుతూ వైద్య శాఖ ఆధ్వర్యంలో ముప్కాల్ మండల కేంద్రంలో, మెండోరా మండలం పోచంపాడ్‌లో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఆదివారం నిర్వహించే పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పోచంపాడ్ వైద్యాధికారి రాకేశ్ కోరారు. నందిపేట పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో ఆదివారం నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వైద్యాధికారి ప్రవీణ్, హెల్త్ సూపర్‌వైజర్ భాస్కర్ తెలిపారు. మండల కేంద్రంలో పల్స్ పోలియో విజయవంతం చేయాలని కోరుతూ ర్యాలీ నిర్వహించారు.

**పోలియో చుక్కలు వేయించాలి**

**డొంకేశ్వర్:** ఐదేళ్లలోపు పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది తల్లిదండ్రులకు సూచించారు. శనివారం డొంకేశ్వర్ మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో పల్స్ పోలియోపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ నెల 3 నుంచి 5వరకు పోలియో చుక్కలు వేసే కార్యక్రమం ఉంటుందని హెల్త్ సూపర్‌వైజర్లు సురేందర్, ప్రమీల పేర్కొన్నారు.

## క్లుప్తంగా

### ఆస్తి పన్ను వడ్డీపై రాయితీ

**ఆర్మూర్‌టౌన్:** రాష్ట్ర ప్రభుత్వం ఇంటి పన్ను చెల్లింపు దారులకు 2022–23 సంవత్సరానికి ఆస్తి పన్నులపై ఉన్న పెనాల్టీపై 90శాతం రాయితీని అందిస్తోందని మున్సిపల్ కమిషనర్ రాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని మున్సిపల్ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### పోస్టర్ల ఆవిష్కరణ

**పెర్కిట్(ఆర్మూర్):** మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి నలంద హైస్కూల్ 20వ వార్షికోత్సవ వేడుకలను ఈ నెల 7న నిర్వహించనున్నట్లు పాఠశాల యాజమాన్యం నలంద ప్రసాద్, నలంద సాగర్ తెలిపారు. వేడుకలకు సంబంధించిన పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. వేడుకలకు జబర్దస్త్ షో నటులు బుల్లెట్ భాస్కర్, నటులు నరేశ్, జితేందర్ హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

### దోమల నివారణకు కృషి చేయాలి



**బాల్కొండ:** దోమల నివారణకు కృషి చేయాలని జిల్లా మలేరియా అధికారి రాథోడ్ అన్నారు. మెండోరా మండలం పోచంపాడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలో ఆశావర్కర్లు, సిబ్బందితో సమీక్షా సమావేశ నిర్వహించారు. దోమల నివారణకు గ్రామాల్లో మందులు పిచికారీ చేయించాలన్నారు. పీహెచ్‌సీలో ఉన్న మలేరియా మందులను పరిశీలించారు. ఆయన వెంట వైద్యాధికారి రాకేశ్, సిబ్బంది ఉన్నారు.

### మహాసభలను విజయవంతం చేయాలి

**బోధన్:** ఖమ్మం జిల్లాలో ఆదివారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించే కమ్యూనిస్టు పార్టీల ఐక్యత జాతీయ మహాసభలను ప్రజలు విజయవంతం చేయాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా డివిజన్ సహాయ కార్యదర్శి మల్లేశ్ కోరారు. శనివారం పట్టణ కేంద్రంలోని పీఆర్‌టీయూ భవన్‌లో పార్టీ నాయకులతో కలిసి మాట్లాడారు. మూడు కమ్యూనిస్టు పార్టీల ఐక్యత విప్లవోద్యమ నిర్మాణ పటిష్టతకు మరో ముందడుగని పేర్కొన్నారు. నాయకులు పడాల శంకర్, సుల్తాన్ సాయిలు, నాగమణి, సీతారం, బిపాషాబేగం, అరుణ, శాంతక్క,గంగయ్య, లక్ష్మీబాయి, పోశెట్టి పాల్గొన్నారు.

### కలెక్టర్‌కు ఆహ్వానం

**నవీపేట:** మండలంలోని నాళేశ్వర్ ఉన్న రాజరాజేశ్వరాలయంలో ఈనెల 8, 9వ తేదీలలో నిర్వహించే మహాశివరాత్రి ఉత్సవాలకు హాజరుకావాలని కోరుతూ వీడీసీ ప్రతినిధులు శనివారం కలెక్టర్‌కు ఆహ్వాన పత్రికను జిల్లా కేంద్రంలో అందజేశారు. సొసైటీ చైర్మన్ మగ్గారి హన్మాండ్లు, మాజీ సర్పంచ్ ద్యాగ సరిన్, ఉప సర్పంచ్ లక్ష్మణ్, రమేశ్, కృష్ణ, శివ తదితరులు ఉన్నారు.

### సమయపాలన పాటించాలి

**నవీపేట:** గ్రామ స్థాయి అధికారులు సమయ పాలన పాటించాలని డీపీవో తరుణ్ ఆదేశించారు. ఎంపీడీవో కార్యాలయలంలో శనివారం జరిగిన కార్యదర్శుల సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. పారిశుద్ధ్య లోప నివారణ చర్యలను వేగవంతం చేయాలన్నారు. సమావేశంలో డీఎల్‌పీవో శ్రీనివాస్, స్పెషల్ ఆఫీసర్ యోహన్, ఎంపీడీవో నాగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

### కోటగిరి ఆస్పత్రి తనిఖీ

**రుద్రూర్:** కోటగిరి మండల కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిని తహసీల్దార్ సునీత శనివారం తనిఖీ చేశారు. రోగులకు సరైన చికిత్స అందించడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయని సిబ్బందిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు.

### గుంత పూడ్చివేత



**రెంజల్:** మండలంలోని నీలా హైస్కూల్ ఆవరణలో ఉన్న మోట బావి గుంతను ఎమ్మెల్యే సహకారంతో పూడ్చివేసినట్లు గ్రామస్తులు శనివారం పేర్కొన్నారు. ఇటీవల గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి స్కూల్ ఆవరణలో ఉన్న మోట బావిని పూడ్చేందుకు సహకరించాలని కోరగా స్పందించిన ఎమ్మెల్యే నిధులు కేటాయించడంతో పనులను హెచ్ఎం శంకర్ చొరవతో త్వరగా పూర్తి చేసినట్లు తెలిపారు.

### ఆర్థికసాయం అందజేత

**వేల్పూర్:** మండలంలోని జాన్కంపేట్ గ్రామంలో తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న సొడ సాక్షి అనే విద్యార్థిని వైద్యం కోసం రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ సుంకెట అన్వేశ్‌రెడ్డి శనివారం రూ. 5 వేల ఆర్థికసాయాన్ని బాలిక తల్లి వాణికి అందజేశారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు జేమ్స్ గంగారెడ్డి, సొడ శ్రీనివాస్, తాళ్ల పద్మారావు, కిశోర్‌గౌడ్, వినోద్, సొడ ప్రభుదాస్, సదానందం తదితరులు ఉన్నారు.

# వైస్ చైర్మన్ పదవి కాంగ్రెస్ కైవసం

- ఏకగ్రీవంగా మోర్తాడ్ ముత్యం ఎన్నిక



ముత్యంను సన్మానిస్తున్న పాలకవర్గ సభ్యులు

**డొంకేశ్వర్:** డొంకేశ్వర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) వైస్ చైర్మన్ పదవిని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. రాజారెడ్డిపై పెట్టిన అవిశ్వాసం నెగ్గడంతో ఖాళీగా ఏర్పడిన వైస్ చైర్మన్ పదవికి జిల్లా సహకార శాఖ అధికారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం ఎన్నిక నిర్వహించారు. పాలకవర్గ సమావేశం నిర్వహించి నామినేషన్లు స్వీకరించారు. నిర్ణీత సమయంలోపు ఒక్కరే నామినేషన్ వేయడంతో వైస్ చైర్మన్ ఎన్నిక ఏకగ్రీవమైనట్లు డీసీవో ప్రకటించారు. మోర్తాడ్ ముత్యం వైస్ చైర్మన్‌గా ఎన్నికైనట్లు పత్రాన్ని అందజేశారు. అనంతరం సొసైటీ చైర్మన్ బార్ల భరత్ రెడ్డి, పాలకవర్గ సభ్యులు కలిసి వైస్ చైర్మన్‌ను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. పదవిని కాంగ్రెస్ కైవసం చేసుకోవడంపై నందిపేట్, డొంకేశ్వర్ మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మంద మహిపాల్, గోడిశరం భూమేశ్ రెడ్డిలు హర్షం వ్యక్తం చేశారు. అలాగే డొంకేశ్వర్ సొసైటీ చరిత్రలో బీసీ వర్గానికి చెందిన వ్యక్తి వైస్ చైర్మన్ పదవి రావడం గమనార్హం. సమావేశంలో సొసైటీ సీఈవో కృష్ణ, సిబ్బంది ఉన్నారు.

# సేవలను సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

**కమ్మర్‌పల్లి:** మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజా పాలన సేవా కేంద్రం సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో రాజశ్రీనివాస్ కోరారు. మండలంలోని కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులతో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేసిన 200 యూనిట్ల ఉచిత్ విద్యుత్, వంట గ్యాస్ సిలిండర్ పథకాలు, తప్పుల వల్ల అందకపోతే ప్రజా పాలన సేవా కేంద్రంలో సంప్రదించాలన్నారు. గత నెలలో నిర్వహించిన ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న వారికి వివిధ కారణాలతో విద్యుత్ జీరో బిల్లు, గ్యాస్ సిలిండర్ సబ్సిడీ ఖాతాలో జమ కాకపోతే సంబంధిత ధ్రువపత్రాలతో సేవా కేంద్రంలో సంప్రదించాలన్నారు. ప్రజలకు ప్రజాపాలన సేవా కేంద్రంపై అవగాహన కల్పించాలని కార్యదర్శులకు సూచించారు.

## గృహజ్యోతి బిల్లుల అందజేత



ఆలూర్‌లో జీరో బిల్లులను అందజేస్తున్న సిబ్బంది



రాంనగర్‌లో..

**పెర్కిట్(ఆర్మూర్)/ ఆర్మూర్‌టౌన్:** ఆలూర్ మండల కేంద్రంలో శనివారం విద్యుత్ వినియోగదారులకు గృహజ్యోతి పథకంలో భాగంగా జీరో విద్యుత్ బిల్లులను అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆలూర్ మండల అధ్యక్షుడు ముక్కెర విజయ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మల్లా రెడ్డి, సంజీవ్, లైన్‌మన్ శివ, చింటూ, నారాయణ, ఉదయ్, నవనీత్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్ పట్టణంలోని రాంనగర్ కాలనీతో పాటు పలు కాలనీలోని వినియోగదారులకు గృహజ్యోతి బిల్లులను విద్యుత్ శాఖ అధికారులు అందజేశారు. కార్యక్రమంలో డీఈ హరిచంద్ నాయక్, ఏడీఈ శ్రీధర్, ఏఈ మనీషా, జేఏవోలు హరీశ్, ప్రకాశ్, లైన్‌మన్ ప్రభాకర్, జూనియర్ లైన్‌మన్ శివ తదితరులు పాల్గొన్నారు.

# భగవంతుడి నామస్మరణతో ముక్తి



పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్న హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామి

**బోధన్:** భగవంతుని నామస్మరణతో ముక్తి లభిస్తుందని, భగవంతుడి దశావతారాల్లో ఏ అవతారం చూసినా ఎంతో జ్ఞానం ఉంటుందని హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామి అన్నారు. పట్టణంలోని గ్రామ చావిడి వద్ద ఉన్న పురాతన హనుమాన్ ఆలయాన్ని గ్రామ కమిటీ, దాతల సహకారంతో పునర్నిర్మాణం చేపట్టారు. ఆఖరి రోజైన శనివారం ఆలయంలో స్వామివారి మూర్తి, శిఖర స్థిర ప్రతిష్ఠ మహోత్సవాన్ని వైభవంగా చేపట్టారు. హంపీ పీఠాధిపతి చేతుల మీదుగా శిఖర ప్రతిష్ఠాపన చేశారు. ఆలయం ప్రాంగణంలో హోమం, మహాపూజ, బలిహరణ, పూర్ణాహుతి, శాంతి కల్యాణం నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. వేదపండితుడు బ్రహ్మశ్రీ భాస్కర చార్య గణేశ్ మహరాజ్, శ్రౌతి మురళీధర శర్మ, గ్రామ కమిటీ అధ్యక్షుడు బాగయ్య యాదవ్, ప్రతినిధులు కొంద్ర వెంకటి, పూజారి లింగం, మాసుల శ్రీనివాస్, రుద్ర సత్యనారాయణ పాల్గొన్నారు.

# మాజీ స్పీకర్ శ్రీపాదరావు సేవలు చిరస్మరణీయం



ఆర్మూర్‌లో నివాళులు అర్పిస్తున్న అధికారులు



కమ్మర్‌పల్లిలో..

**ఆర్మూర్‌టౌన్/ కమ్మర్‌పల్లి/ రుద్రూర్:** మాజీ స్పీకర్ శ్రీపాదరావు సేవలు చిరస్మరణీయమని పలువురు అధికారులు అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ అధికారులు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ శ్రీపాదరావు జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారంగా నిర్వహించినట్లు పేర్కొన్నారు. కమ్మర్‌పల్లిలోన ఎంపీడీవో కార్యాలయంలో, రుద్రూర్‌లోని సమీకృత కార్యాలయ సముదాయ సమావేశపు హాల్‌లో స్పీకర్ శ్రీపాదరావు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి అధికారులు పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు.

### ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



**డొంకేశ్వర్(ఆర్మూర్):** మండలంలోని దత్తాపూర్ శివారులో ఇనుప చువ్వలు తేలిఓ విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా మారింది. నికాల్‌పూర్‌కు వెళ్లే బై పాస్ రోడ్డుకు ఆనుకుని వ్యవసాయ భూముల్లో ఉండడంతో ఈ స్తంభం ఎప్పుడు విరిగి పడుతుందో తెలియక రైతులు ఆందోళన చెందుతున్నారు. కొత్త పోల్ వేయాలని ఏడాదిన్నర కాలంగా స్థానిక లైన్ మన్‌కు విన్నవిస్తున్నా పట్టించుకోవడం లేదని రైతు లు ఆరోపిస్తున్నారు. స్తంభాన్ని మీరే కొనుక్కుని ఏర్పాటు చేసుకోవాలని నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని రైతులు వాపోతున్నారు.

### ఉత్సవ కమిటీ నియామకం

**బోధన్ రూరల్:** పట్టణంలోని శ్రీ చక్రేశ్వర ఆలయ ఉత్సవ కమిటీని నియమిస్తూ దేవాదాయ శాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులుగా కర్నె హనుమంత్‌రావు, గుండేటి రాములు, కట్కం రమేశ్, తడు మహేశ్, సుర లింగం, మారడోళ్ల కవిత, కమల భూమేశ్ నియామకమయ్యారు. ఈ నెల 4 నుంచి 15వ తేదీ వరకు కమిటీను నియమిస్తూ దేవాదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేసిందని బోధన్ దేవాదాయ శాఖ అధికారులు శనివారం పేర్కొన్నారు.

### రిజిస్టర్‌లను సక్రమంగా నిర్వహించాలి



**రెంజల్(బోధన్):** పంచాయతీలకు సంబంధించిన రిజిస్టర్‌లను సక్రమంగా నిర్వహించాలని బోధన్ డీఎల్‌పీవో సాయిబాబా సూచించారు. మండలంలోని అంబేద్కర్‌నగర్ జీపీని శనివారం సందర్శించి రికార్డులను పరిశీలించారు. గ్రామాల్లో చేపడుతున్న పనుల వివరాలను పూర్తిగా రిజిస్టర్‌లలో నమోదు చేయాలని కార్యదర్శి సునీల్‌కు సూచించారు. వేసవిలో తాగు నీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అన్నారు.

**జాన్కంపేట్‌లో..**

**ఎడపల్లి:** ప్రజలకు తాగునీటి ఇబ్బంది లేకుండా చూడాలని జీపీ సిబ్బందికి డీఎల్‌పీవో సాయిబాబా సూచించారు. మండలంలోని జాన్కంపేట్ జీపీని సందర్శించి గ్రామంలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. గ్రామంలో ఉన్న సమస్యలను వారం రోజుల్లో పూర్తి చేయాలని పంచాయతీ కార్యదర్శి ప్రేమ్‌దాస్‌ను ఆదేశించారు. అనంతరం గ్రామపంచాయతీ కార్మికులకు శాలువాతో సన్మానించారు. ఆయన వెంట ఎంపీవో సుభాష్‌చంద్రబోస్, జీపీ సిబ్బంది ఉన్నారు.

# అంగన్‌వాడీ భవనాలు త్వరగా పూర్తి చేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ సుజాత నాగేందర్

**రుద్రూర్:** మండలంలోని పలు గ్రామాల్లో మంజూరైన అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని ప్రజాప్రతినిధులు డిమాండ్ చేశారు. మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ అక్కపల్లి సుజాతనాగేందర్ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. మండల సభ్యులు సభ దృష్టికి తెచ్చిన సమస్యలను త్వరగా పరిష్కరించాలని ఎంపీపీ అధికారులకు సూచించారు. గృహజ్యోతి పథకంపై ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్ సందేహాలను నివృత్తి చేశారు. ఎంపీడీవో సురేశ్‌బాబు మాట్లాడుతూ.. ప్రజాపాలన దరఖాస్తుల్లో సరైన వివరాలు నమోదు చేయని వారి కోసం ప్రజాపాలన సేవా కేంద్రం ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. జడ్పీటీసీ నరోజీ గంగారాం, తహసీల్దార్ వెంకటేశ్, మండల కోఆప్షన్ సభ్యుడు మస్తాన్, ఎంపీటీసీలు హన్మంత్‌రావు పటేల్, గౌస్, పత్తి సావిత్రి, ఎంఈవో శాంతకుమారి, ఎంపీవో సాయిలు, అధికారులు పాల్గొన్నారు.

# మూడు కొత్త చట్టాలపై అవగాహన



మాట్లాడుతున్న ఏజీపీలు శ్యాంరావు, సమ్మయ్య, చిదిరాల రాణి

**బోధన్:** రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ వైజయంతి ఆదేశాల మేరకు శనివారం బోధన్ కోర్టులో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు కొత్త చట్టాలపై పోలీస్, ఫారెస్టు శాఖల అధికారులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఏజీపీలు శ్యాంరావు, డాక్టర్ సమ్మయ్య, చిదిరాల రాణిలు వివిధ చట్టాల వివరాలను వివరించారు. క్షేత్ర స్థాయిలో పని చేస్తున్న పోలీస్, ఫారెస్టు శాఖల అధికారులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కేంద్రం తెచ్చిన భారతీయ న్యాయ సంహిత–2023, భారతీయ నాగరిక సురక్ష, భారతీయ సాక్ష్య అధినియం న్యాయం చట్టాలపై ఏజీపీలు మాట్లాడారు. ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ పద్మారావు, సెక్షన్ ఆఫీసర్లు, బీట్ ఆఫీసర్లు, పోలీస్ శాఖ అధికారులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

### విప్లవోద్యమ నిర్మాణానికి ఐక్యత సభలు

**నందిపేట్:** విప్లవోద్యమ నిర్మాణానికి ఐక్యత సభలు దోహదపడతాయని సీపీఐఎంఎల్ మాస్ లైన్ (ప్రజాపంథా) రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్, జిల్లా నాయకుడు గంగాధర్ అన్నారు. మండలంలోని వెల్మల్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఖమ్మంలో నిర్వహించే ఐక్యత మహాసభలను ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని కోరారు. సాయిరెడ్డి, అనంతరావు, రాజలింగం, గంగాధర్, నర్సయ్య, సంఘం మల్లన్న, చింతకుంట వెంకన్న, గంగారాం ఉన్నారు.

### సమాచారం అందించాలి

**కమ్మర్‌పల్లి:** మండలంలోని ఆయా శాఖల మండల అధికారులు తమ శాఖ సమాచారం పూర్తిగా జీపీ కార్యదర్శులకు అందించాలని ఎంపీడీవో రాజశ్రీనివాస్ సూచించారు. మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో వివిధ శాఖల అధికారులు, జీపీ కార్యదర్శులతో శనివారం సమావేశం నిర్వహించారు. అధికారులు సోమవారం లోగా సమాచారం అందించాలన్నారు. సమాచారం తీసుకున్న వెంటనే కార్యదర్శులు పంచాయతీ ఆపరేటర్ల ద్వారా ఆన్‌లైన్‌లో సమాచారం నిక్షిప్తం చేయాలని సూచించారు.

### ‘లోటస్’లో ఫుడ్ ఫెస్టివల్



**ఆర్మూర్‌టౌన్:** పట్టణంలోని లోటస్ స్మార్ట్ స్కూల్లో శనివారం ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ ఇంటి నుంచి వివిధ రకాల ఆహార పదార్థాలు తీసుకొచ్చి ప్రదర్శించారు. పాఠశాల కరస్పాండెంట్ అంబిక పవర్ మాట్లాడుతూ.. విద్యార్థులు పోషకాలు కలిగిన ఆహార పదార్థాలను స్వీకరించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### విగ్రహ ఏర్పాటుకు వినతి

**కమ్మర్‌పల్లి:** మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ భవనం ఎదుట ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహ ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ స్థానిక జీపీ కార్యదర్శి శాంతికుమార్‌కు ఛత్రపతి శివాజీ మహరాజ్ యూత్ సభ్యులు శనివారం వినతిపత్రాన్ని అందజేశారు. నవీన్, ప్రభాకర్, హరీశ్, సిద్ధార్థ్, కమలాకర్, మహర్షి పాల్గొన్నారు.

### సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



**పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)**

| | |
|---|---|
| స్క్రీన్-1 – | మా ఊరి రాజారెడ్డి - 10.30<br>వ్యూహం (తెలుగు) - 1.00<br>ఊరు పేరు భైరవకోన - 3.45<br>ముఖ్య గమనిక (తెలుగు) - 7.00<br>కిక్ (తెలుగు) - 9.45 |
| స్క్రీన్-2 – | ఆపరేషన్ వాలెంటైన్ (తెలుగు) - 12.15, 3.10, 6.05, 9.00 |
| స్క్రీన్-3 – | ఊరు పేరు భైరవకోన (తెలుగు) - 12.45, 10.00<br>హనుమాన్ (తెలుగు) - 3.45<br>ఆపరేషన్ వాలెంటైన్ (తెలుగు)-7.05 |
| స్క్రీన్-4 – | ఇంటి నెంబర్ -13 - 10.45<br>చారి-111(తెలుగు) - 1.30, 7.20<br>భూతద్దం భాస్కర్ - 4.20, 10.10 |

### సాఫ్ట్‌బాల్ క్రీడాకారిణికి సీఎం అభినందన



**ఆర్మూర్‌టౌన్:** పట్టణంలోని గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థిని అజ్మీర ఇందును సీఎం రేవంత్ రెడ్డి అభినందించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ధనవేణి శనివారం తెలిపారు. గత నెల 21 నుంచి 25 వరకు బీహార్‌లోని పాట్నాలో జరిగిన జాతీయస్థాయి సాఫ్ట్‌పోటీల్లో తెలంగాణ జట్టు బంగారు పతకం సాధించింది. ఈ జట్టుకు అజ్మీర ఇందు ప్రాతినిధ్యం వహించింది. బుధవారం సచివాలయంలో తెలంగాణ సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు, బాలికల జట్టు ముఖ్యమంత్రిని కలిశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి క్రీడాకారులను అభినందించారు. అలాగే నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి ఇందును అభినందించారు.

### సీఎంను కలిసిన మచ్చర్ల నాయకుడు

**పెర్కిట్(ఆర్మూర్):** ఆలూర్ మండలం మచ్చర్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు జితేందర్‌రెడ్డి శనివారం సీఎం రేవంత్‌రెడ్డిని సీఎం కార్యాలయంలో కలిశాడు. ఉర్దూ అకాడమీ చైర్మన్‌గా నియమితులైన తాహెర్‌బిన్ సీఎంను కలవడానికి రావడంతో జితేందర్‌రెడ్డి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.